# భక్తార్తిత్రాణ పరాయణత్వం భగవంతునిలోనే ఉన్నది!!

## - భక్తులు వాంఛితాలతో యిచ్చినదంతా తిరిగి వారికే యిచ్చే ఉదారగుణం భగవంతునికే ఉన్నది!! -





నీ కొండకొస్తున్నాం! ముడుపులిస్తున్నాం! మమ్మాదుకోఁవయ్యా ఏడుకొండలవాడ - మమ్మేలువాడ - వేంకటేశ్వరా! యని భక్తులు తీరిన కోరికలకు ముడుపులు కట్టి, లేదా నోట్లు కట్టని కట్టి హుండీలో వేసి, కొసరుగా మరికొన్ని కోరికలు కోరుతుంటారు. కరుణాంతరంగుడైన ఆ కోనేటిరాయుడు గ్రహించిన ధనకనకాలనన్నిటినీ తిరిగి భక్తులకే యిచ్చేస్తున్నాడు. తాను కుబేరుని వద్ద తీసుకున్న అప్పుకు వడ్డీలు కడుతూ అసలు అసలుగానే ఉండగా, భక్తులిచ్చినవన్నీ తిరిగి వారికే యిచ్చేస్తున్నాడు! మనకు ఆయన అప్పుల సంగతి తెలుసు. వడ్డీకాసుల వాడా! నీ అప్పులు నీకెలా ఉన్ననూ, మాకు సిరి సంపదలివ్వవయ్యా! శరీర ఆరోగ్యం యివ్వవయ్యా! మా పిల్లలకు కాలేజీల్లో చదువు చెప్పించు, లేదా చదువుకున్నవాళ్ళు యింట్లో ఉంటే వాళ్లకు ఉద్యోగాలు వేయించు! వాడికి విదేశాల్లో వేయించావంటే తలనీలాలు యిస్తాం. తులాభారం వేసి నీ ఋణం తీర్చుకుంటాం అంటారుగానీ భక్తులు ఏ కోరికా కోరకుండా వెళ్లరు.

గత గణాంక లెక్కల ప్రకారం 1641.76 కోట్లు వార్షిక బడ్జెటట. వివిధ బ్యాంకు డిపాజిట్లు ద్వారా వచ్చే ఆదాయం రెండు వేల కోట్లు అనీ, హుండీల ద్వారా వచ్చింది ఐదు వందల యాభై అయిదు కోట్లనీ, ఈ సంవత్సరం మరో వంద కోట్లు పెరగవచ్చునంటున్నారు. శీఘ్రదర్శనం ద్వారా 167 కోట్లు, ఆర్జిత సేవా టిక్కెట్ల ద్వారా 46 కోట్లు, లడ్డూ విక్రయాల ద్వారా 114 కోట్లు, భక్తులకు బస వసతులను కల్పించడం మూలకంగా 54 కోట్లు, తలనీలాల విక్రయం ద్వారా 20 కోట్లు, చిన్నాచితకా వనరుల నుంచీ 75.91 కోట్లు లభిస్తాయని అంచనా వేస్తే, సిబ్బంది జీతభత్యాలకు ఆయన 233.47 కోట్లు వెచ్చిస్తున్నారు. విద్యార్థుల చదువుల కోసం, ఇంజనీరింగు పనుల కోసం, వైద్యారోగ్య సేవల కోసం, హిందూ ధర్మ ప్రచార పరిషత్తు నిర్వహించే ధార్మిక కార్యక్రమాల కోసం, దళిత వాడల్లో వేంకటేశ్వర ఆలయాలు నిర్మించడం, కమ్యూనిటీ హాలులు, కల్యాణమండపాల నిర్వహణానికీ ఎన్నెన్నో కోట్ల రూపాయలను వేంకటేశ్వరస్వామి తిరిగి యిచ్చేస్తున్నారు. ఇదిగాక అన్నిదానములకన్నా అన్నదానము మిన్నయనీ వేంకటేశ్వర స్వామి వారు రోజుకు లక్షమంది భక్తులకు కడుపునిండుగా భోజనం పెడుతున్నారు. ఉచిత బస్సు సౌకర్యం, ఉచిత (ధర్మ) దర్శనం, అన్న ప్రసాదాల వితరణం చూస్తుంటే భగవంతుడు భక్తాది పరాయణత్వంగా ఆయన చేయనిదీ, చేయలేనిదీ ఏముందనిపిస్తున్నది.

ఎటొచ్చీ ఆయన తన పెళ్ళి అప్పుల అసలును తీర్చడం లేదు. స్వార్థానికి ఆయన చిల్లుగవ్వ ఖర్చుపెట్టుకోవడం లేదు. ఇంకా చిన్న చిన్న దేవాలయాలకు, తనకు సేవలు చేసిన అన్నమాచార్యకూ, తరిగొండ వేంగమాంబ ప్రాజెక్టు కోసం ఇతరత్రా ఏఁదేవుడూ చేయని జనోపకార్యాలను ఆయన చేస్తున్నారు.

సనాతన ధర్మానికి మూలమైన వేద విశ్వవిద్యాలయం, సంస్కృత డ్రీమ్డ్ విశ్వవిద్యాలయం, పి.జి. చదువుల కోసం, వికలాంగులకు కృత్రిమ అవయవాలను తయారుచేసి యివ్వడం, పేదలు, అనాథల నిమిత్తార్థం, ఆధ్యాత్మిక, ధార్మిక, ఆర్ష్య, నైతిక విలువలతో రచనలు చేసే కవులను ప్రోత్సహించడం, విశ్వంలోని భక్త జనావళి కోసం శ్రీవారి టి.వి. చానల్, ఆయుర్వేద ఆసుపత్రి, ప్రాచ్య తాళపత్ర, పుస్తక భాండాగార నిర్వహణం, విద్యాదాన ట్రస్టు, శంకర నేత్రాలయ ట్రస్టు, ప్రాణదాన ట్రస్టు, పురావస్తు భద్రతా ట్రస్టు, లలిత కళావిభాగాలన్నిటికీ కళాశాలలు, వాటి పోషణ, త్యాగరాజు ట్రస్టుకు ప్రోత్సాహం ఆస్థానమండపంలో కళాకారుల కార్యక్రమాల ద్వారా ప్రోత్సాహం, శ్రీవారి విగ్రహాలు కావాలనుకునే మందిర సంస్థలకు 50 శాతం రాయితీతో యివ్వడం, ఉచిత లడ్డూ పంపిణీలతో వేంకటేశ్వరుడెంతగా ధనాన్ని తిరిగి యిస్తున్నాడో ఆయనకే తెలియదు.

**'శ్రీ వేంకటేశ్వర సమోదేవో నాస్తి నాస్తి మహీతలే!'** అన్నది అక్షర సత్యం. ప్రపంచంలో ఇటువంటి విశిష్టిత గల క్షేత్రం లేనే లేదు. ఇది ఆంధ్రదేశం కారణంగా భారతదేశం చేసుకున్న పుణ్యపలం.

ఆనాడు రాజులు, చక్రవర్తులు, సార్వభౌములు స్వామివారికి మాన్యాలు యిచ్చారు. మణులూ, రత్నాలను, సువర్ణాభరణాలిచ్చారు. కానీ యీనాటి రాజులైన ప్రజాస్వామ్య నాయకులు వేంకటేశ్వరస్వామి నుంచీ తీసుకుంటున్నారు, దర్శనానికి వచ్చే వేంకటేశ్వరస్వామి భక్తుల నుంచీ వివిధ సేవల రూపంగా ధనం తీసుకుంటున్నారు.

అడగనిదే తల్లియైనా పెట్టదంటారు. కానీ ఈ అయ్య పద్మావతీ పతి శ్రీనివాసుడు అడిగినా, అడగకపోయినా యిస్తున్నాడు.






షిర్డీ సాయినాథుడంటే విశ్వంలోనే ఆదాయంలో రెండవ పెద్ద దైవం. సాయీనాథునికి బ్యాంకు డిపాజిట్ల రూపంలోనే 420.17 కోట్లు ఉన్నాయి. కిసాన్ వికాస్ పత్రాలలో 51.71 కోట్లు, పొదుపు పథకాల క్రింద 48.16 కోట్లు, జీవన్ ప్రాధికార డిపాజిట్లలో 8 కోట్లు, కార్పస్ ఫండ్ 47.82 కోట్లు, ఇవిగాక వివిధ బ్యాంకు పథకాల్లోని నిధులు 319.30 కోట్లు, బంగారు ఆభరణాలు 24.41 కోట్లు, 3.26 కోట్లు వెండి, 6.12 కోట్లు వెండి నాణెములు, 1,288 కోట్లు బంగారు నాణెములు, 1.123 కోట్లు బంగారు లాకెట్లు. ఇంతేగాకుండా సాయినాథ సంస్థానం తనకున్న వనరుల ద్వారా సాయిభక్త కూటములను ప్రోత్సహించడానికి, సాయికథాసుధను వివిధ భాషల్లో ప్రచురించడానికి పలు సామాజిక కార్యక్రమాలకు, వసతులకూ, అన్నదాన పథకానికీ, ఆరోగ్య సేవలు, విద్యాసంస్థలకు ఆర్థిక సహాయం, విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ప్రకృతి భీభత్సాలు జరిగినప్పుడు మందులు, ఆహారం, దుస్తులు, వైద్యసదుపాయం లేని 'పల్లెల్లో ఆరోగ్య శిబిరాలు. గ్రామశుద్ధి కార్యక్రమాలు, వేలాదిమందికి ఉద్యోగోపాధి, భక్తులకు వసతి సౌకర్యం, తిరుపతి దేవస్థానము వలె ధర్మసంస్థాపనా పథకాలనేగాకుండా, సమత, మమత, సమైక్య భావనను పెంచే సదుద్దేశంతో హిందూ, ముస్లిము సమభావనా సాంప్రదాయాచారాలను పాటిస్తూ, అన్ని మతాలకూ ఆర్థికంగా సహకారమందిస్తూన్నది. తిరుమల వేంకటేశ్వరాలయం తరువాత, షిర్డీ సాయీనాథుని క్షేత్రానినే ఎక్కువ భక్తులు సందర్శిస్తున్నారు. విదేశాల్లో కూడా సాయీనాథుని మందిరాలున్నాయ్. ఈమధ్య కాలంలో లక్షలాది భక్తులూ, కోట్లాది రూపాయల ఆదాయం, సాయినాథుడు సజీవంగా ఉన్నప్పుడు వచ్చిన ఆదాయాన్ని వచ్చినట్లుగా ప్రజలకు తిరిగి యిచ్చినట్లుగా, ప్రజోపయోగ కార్యాలకు సాయీ సంస్థానం ఖర్చుపెడుతూన్నది.



అఖిల ప్రపంచప్రఖ్యాతి గాంచినది ఆంధ్రదేశంలోని పుట్టపర్తి సత్యసాయిబాబా ప్రశాంతి నిలయం క్షేత్రం. బాబా వెళ్ళని ప్రాక్పశ్చిమ దేశాల్లో కూడా సత్యసాయికి అంకితభక్తులున్నారు. ప్రజలకు సేవ చేయడానికి సత్యసాయీ సేవా సంస్థలున్నాయ్. ఎన్నో మతాలవారు, ఎన్నో భాషలవారు పర్తీ క్షేత్రం వస్తుంటారు. ఆయన జీవించిన 85 సం॥ముల కాలమూ ఎందరికో అపురూపపు వస్తువులనుగాలిలోంచి తీసియిచ్చేవారు. సనాతన ధర్మ విశిష్టతను ఆయన బోధించినట్లుగా ఎవరూ బోధించారు! ఆయన సాహిత్యం ఉన్నట్టు ఎవరి సాహిత్యమూ లేదు. అక్కడ పనిచేసిన సిబ్బంది సేవాదళమే గానీ, జీతభత్యాలు తీసుకొనేవారు లేరు. విద్యాలయాలు, విశ్వవిద్యాలయాలు, సంస్కృత విద్యాలయాలు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు, ఖరీదైన మందులకు సహితం, ధనం అనుగ్రహించకుండా ఉచిత చికిత్సలు చేయిస్తూ, వారికి భోజన వసతులు కూడా ఉచితంగా కల్పించే ఏకైక సంస్థ, వివిధ దేశాల్లో, వివిధ ప్రదేశాల్లో ఆయన ఫోటోల్నుంచీ విభూతీ, తేనే రాలడం విశేషం, తేనెలాంటి విద్వత్పలుకులు పలుకడం ఆయనకే చెల్లింది. ఆయన ఏ ఆభరణాలు ధరించలేదు. ఎవర్నుంచీ ఆయన చేతికి ధనం అంటనీయలేదు. పర్తీ మందిరంలో కానీ, ఆయన స్థాపించిన సంస్థల్లో కానీ ఎవరూ చేయి పెట్టి డబ్బు అడగరు. ఆ సంస్థానంలో ఎక్కడా హుండీలు లేవు. ఎవరైనా ఏదైనా యివ్వదలచుకున్నప్పుడే, చెక్కులు, డి.డీ. బ్యాంకు పత్రాల రూపంలో ట్రస్టుకే యివ్వాలి. ద్రవ్యరూపంగా ఎవరూ స్వీకరించరు. ఆయన ట్రస్టు ద్వారా కోట్లకు కోట్ల రూపాయలు వివిధ రాష్ట్రాల నీటి పథకాలకు విరాళంగా యిచ్చేవారు. ప్రపంచంలో ఏ దేఁవుడూ అవధూతా, ఇలా రెండు చేతులా వారియిచ్చినవారు లేరు. ఆయన కోసం ప్రచారం చేసుకున్న దాఖలాలు లేవు. దేశసార్వభౌములు, రాష్ట్రపతులు, ప్రధానమంత్రులు, ముఖ్యమంత్రులు, కేంద్రమంత్రులు, సైన్యాధిపతులు, క్రీడాకారులు, కళాకారులు, ఉన్నతాధికారులు ఆయన్ను సందర్శించారేగానీ, ఆయనెవర్నీ దర్శించలేదు, సందర్శించమని కోరింది లేదు.

ధర్మము మూర్తీభవించిన వ్యక్తి. ఆయన విద్యాసంస్థల్లో నీతిబోధక విద్యేగానీ, చొప్పదంటి విద్య లేదు. కవులనూ, కళాకారులనూ పోషించారు. గాలిలో సృష్టించిన విభూదితో తీరని రోగాలను నివారణ చేశారు. వచ్చిన భక్తులు చెప్పకుండానే, వాళ్ళ ఈతిబాధలు చెప్పడం, వారింట్లోని బంధువుల రుగ్మతల్ని చెప్పడం, నివారణ చేయడంలో ఆయన ప్రత్యేకత ఆయనిదే! చేత చిల్లుగవ్వ లేకుండా, పర్తి వచ్చి, ఆ క్షేత్రాన్ని విశ్వక్షేత్రంగా మలచిన అద్భుత శక్తి ఆయనిదే! ఆయన్ను మహావిష్ణు అవతారంగానే ప్రపంచం ప్రపంచం అంతా కొలిచింది. ఆయన ఏ పురాణాలూ, శాస్త్రాలూ చదువలేదు. కానీ ఆయనకన్నీ అవగతమే! ప్రపంచంలో కళ్లముందు నడిచిన దేఁవుడు, తనను దర్శించని ప్రపంచ దేశాల వారికి సహితమూ దర్శనమిచ్చి, అద్భుతాలు చూపించిన కలికాలంలోని ప్రత్యక్ష దేఁవుడు. ఈ ముప్పురుమూర్తులూ, భక్తులు సమర్పించిన దానికి పదింతలు తిరిగి యిచ్చారేగాని, వారు అనుభవించలేదు.



భారతదేశమూ, భారతాంతర్భాగమైన ఆంధ్రదేశం చేసుకున్న పుణ్యఫలం. మూడు పావన క్షేత్రాల్లోని రెండు క్షేత్రాలు ఆంధ్రదేశంలోనే ఉన్నాయ్. అందునా రాయలసీమలో ఉండడం దేశప్రజలు చేసుకున్న పుణ్యపలం. ఎన్ని దురాగతాలు సాగుతూన్ననూ, ధూర్తులు దేశంపై పడుతూన్ననూ, ఈ పవిత్రత్రయ క్షేత్రాలే కాపాడుతున్నవనేది సత్యం.

భక్తులు యిచ్చిన సిరి అంతా భక్తులకు తిరిగి యిస్తున్న పరంధాములు భరత వర్షంలోనే ఉన్నారన్న విషయం తెలియచెప్పడమే ఈ వ్యాసం యొక్క పరమార్థం.

